సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 22 । జూన్ । 2025



అమ్మవారికి బోనం

ఎలిగేడు: లలితపల్లి, ఎలిగేడులో యాదవ, కుర్మ సంఘం ఆధ్వర్యంలో బీరన్న పట్నాలు వైవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం గంగా బోనం తదితర పూజలు చేశారు.



కోర్టు భవనం కోసం స్థల పరిశీలన

ధర్మారం: జిల్లా న్యాయమూర్తి సునీత, జూనియర్ సివిల్ జడ్జి సరిత తదితరులు నందిమేడారం జూనియర్ సివిల్ కోర్టు భవనం కోసం స్థల పరిశీలన చేశారు. తహసీల్దార్ పాల్గొన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
36.0/27.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

యోగా సాధన ఇలా..



పద్మాసనంలో జిల్లా జడ్జి కుంచాల సునీత



యోగా సాధనలో సీపీ అంబర్ కిశోర్ ఝా



జ్యోతినగర్ : యోగా సాధనలో ఎన్టీపీసీ ఉద్యోగులు





యోగాసనంలో మహిళ, పెద్దపల్లి డీసీపీ కరుణాకర్



ప్రాణాయామం చేస్తున్న జడ్జిలు స్వప్నారాణి, మంజుల

పెద్దపల్లిరూరల్/జ్యోతినగర్/సుల్తానాబాద్: యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శనివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషరేట్, సింగరేణి, ఎన్టీపీసీ, కలెక్టరేట్, జిల్లా కోర్టు, వైద్య, ఆరోగ్యశాఖ, పోలీసుస్టేషన్లు, తదితర కార్యాలయాల్లో ఉన్నతాధికారులు, అధికారుల ఆధ్వర్యంలో యోగా సాధన చేశారు. యోగా ప్రాముఖ్యత గురించి పలువురు ప్రముఖులు వివరించారు.

న్యూస్‌రీల్

పరిశ్రమలతోనే దేశ ప్రగతి

జ్యోతినగర్(రామగుండం): పరిశ్రమలు పురోగతిలో ఉంటేనే దేశం ప్రగతి సాధిస్తుందని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ అన్నారు. ఎన్టీపీసీ జ్యోతిక ఆడిటోరియంలో బీఎంఎస్ అనుబంధ ఎన్టీపీసీ మజ్దూర్ సంఘ్ 12వ త్రైవార్షిక జాతీయ సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్టీపీసీ ఎన్సీసీ సభ్యుడు సుంకరి మల్లేశం, ప్రతినిధులు రాంరెడ్డి, సురేంద్ర రాథోడ్, బీరేంద్ర, సాగర్‌రాజు, సత్యనారాయణరెడ్డి, రాములు, గిరి, నరేందర్ పాల్గొన్నారు. ఐఎన్టీయూసీకి రాజీనామా చేసిన బండారి కనకయ్య బీఎంఎస్‌లో చేరగా ఆహ్వానించారు.

సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యం



మాట్లాడుతున్న అదనపు డీఆర్డీవో రవీందర్

సుల్తానాబాద్(పెద్దపల్లి): సంపూర్ణ అక్షరాస్యత సాధించడం సామాజిక బాధ్యతని అదనపు డీఆర్డీవో రవీందర్ తెలిపారు. కలెక్టరేట్‌లో సెర్ప్, మెప్మా సిబ్బందికి శనివారం ఉల్లాస్ యాప్‌పై అవగాహన కల్పించారు. జిల్లాలోని స్వశక్తి సంఘ మహిళలు అక్షరాస్యతపై 90శాతం సర్వేచేశారని, మరో రెండుమూడ్రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తిచేసి 'ఉల్లాస్' యాప్‌లో నమోదు చేయాలని కోరారు. చదవడం, రాయడం నేర్చుకున్న మహిళల్ని ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాల కోసం పరీక్షలు రాయించాలని సూచించారు. అడల్ట్ ఎడ్యుకేషన్ ఏపీవో శ్రీనివాస్, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి హన్మంతు, జీసీడీవో కవిత, అధికారి రవి పాల్గొన్నారు.

ఆస్పత్రిలో క్యాంటీన్ ప్రారంభం

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చైతన్య జ్యోతి మహిళా సంఘం ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను అడిషనల్ డీఆర్డీవో రవీందర్ ప్రారంభించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పేషెంట్లకు అవసరమైన ఆహారం సరఫరా చేసేందుకు చైతన్య జ్యోతి జిల్లా మహిళా సమాఖ్యకు డైట్ కాంట్రాక్టు అప్పగించారన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు ప్రకారం నాణ్యమైన భోజనం పేషెంట్లకు అందించాలని ఆయన సూచించారు. అనంతరం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందజేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

నియామకం



జావెద్

పెద్దపల్లిరూరల్: జమాతే ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షుడిగా ఎంఏహెచ్ జావెద్‌ను నియమించారు. ఈమేరకు పట్టణ అధ్యక్షుడు ఎంఏ మోహిద్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. జమాతే ఇస్లామీ హింద్ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో జావెద్‌కు ఈ పదవి అప్పగించినట్లు ఆయన వివరించారు.

గడువు పొడిగింపు

సుల్తానాబాద్(పెద్దపల్లి): అసంఘటిత రంగంలోని కార్మికులు పరిహారం కోసం దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగించారని సహాయ కార్మిక అధికారి ఎంకే హేమలత తెలిపారు. ఈ– శ్రమ్ పోర్టల్‌లో పేరు, ఇతర వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రమాదవశాత్తు చనిపోయిన, శాశ్వతంగా అంగవైకల్యం కలిగినా కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ నుంచి పరిహారం మంజూరవుతుందని హేమలత పేర్కొన్నారు.

2న షిర్డీకి ఆర్టీసీ బస్సు

గోదావరిఖనిటౌన్: వచ్చే జూలై 2వ తేదీన షిర్డీకి ఆర్టీసీ బస్సు సర్వీసు నడుపుతామని డీఎం నాగభూషణం తెలిపారు. ఉదయం 10 గంటలకు గోదావరిఖనిలో సూపర్ లగ్జరీ బస్సు ప్రారంభమవుతుందని, యాత్రలో భాగంగా తొలుత బాసర సరస్వతీదేవి ఆలయం, త్రయంబకేశ్వరాలయం, షిర్డీ సాయి బాబా దర్శనం ఉంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో శని సింగాపూర్ ఆలయాల దర్శనం ఉంటుందని తెలిపారు. జూలై 5వ తేదీన బస్సు గోదావరిఖనికి చేరుకుంటుందన్నారు. పెద్దలకు రూ.4,300, పిల్లలకు రూ. 3,500 ప్రయాణ చార్జీలు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. వివరాలకు 70135 04982, 73828 47427 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

సార్ ఆశయాలతో ముందుకు



నివాళి అర్పిస్తున్న మధు

మంథని: తెలంగాణ రాష్ట్ర సాధనకోసం తుది శ్వాస వరకూ ఉద్యమించిన ప్రొఫెసర్ జయశంకర్ మలిదశ ఉద్యమానికీ ఊపిరి పోశారని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. శనివారం ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మధు మాట్లాడుతూ, ఆనాడు ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జయశంకర్ సారథ్యంలో మాజీ సీఎం కేసీఆర్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారన్నారు. శంకర్‌గౌడ్, తిరుపతి, రాజబాపు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిగురిస్తున్న ఆశలు

- భూ సమస్యల పరిష్కారానికి మార్గం
- జిల్లాలో ముగిసిన భూభారతి సదస్సులు
- సమస్యలపై 15,916మంది దరఖాస్తు
- మిస్సింగ్ సర్వే నంబర్లు, అసైన్డ్‌ల్యాండ్ కేసులే అధికం
- ఆగస్టు 15లోగా పరిష్కరిస్తాం : కలెక్టర్ కోయ శ్రీహర్ష



ఎలిగేడు: ధూళికట్ట భూ భారతి అవగాహన సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది(ఫైల్)

జిల్లాలో భూభారతి అర్జీల వివరాలు

రెవెన్యూ గ్రామాలు	200
అందిన దరఖాస్తులు	15,916
మిస్సింగ్ సర్వే నంబర్లు	2,715
పెండింగ్ మ్యూటేషన్, కోర్టు కేసులు	630
డిజిటల్ సైన్ పెండింగ్	745
విస్తీర్ణంలో వ్యత్యాసం	1,048
భూ స్వరూపం మార్పు	213
పాసుపుస్తకంలో పొరపాట్లు	218
నిషేధిత జాబితా	91
అసైన్డ్‌ల్యాండ్	2,154
ఓఆర్‌సీ జారీ	20
సక్సేషన్	1,367
భూసేకరణ	83
ఇతర	6,632

మండలాల వారీగా అర్జీలు..

మండలం	అర్జీలు	మండలం	అర్జీలు	మండలం	అర్జీలు
				కమాన్‌పూర్	393
		ధర్మారం	1,675	రామగిరి	353
జూలపల్లి	2,061	అంతర్గాం	940	మంథని	1,681
ఓదెల	1,267	పాలకుర్తి	617	ముత్తారం	1,478
సుల్తానాబాద్	1,438	కాల్వశ్రీరాంపూర్	1,381	రామగుండం	124

సాక్షి పెద్దపల్లి: అనేకఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని భూసమస్యలపై జిల్లాలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులకు రైతుల నుంచి దరఖాస్తులు వెలువెత్తాయి. తొలుత పైలెట్ మండలంగా ఎలిగేడును ఎంపిక చేసిన జిల్లా ఉన్నతాధికారులు.. ఆ తర్వాత జిల్లావ్యాప్తంగా అమలు చేశారు. ఈక్రమంలో జూన్ 3 నుంచి శుక్రవారం వరకు 200 రెవెన్యూ గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లెవాసుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

అర్జీల ఆన్‌లైన్‌కు ఇద్దరేసి ఆపరేటర్లు..

ప్రతీ మండలంలో ఇద్దరేసి ఆపరేటర్లను నియమించిన ప్రభుత్వం.. రైతులు ఫిర్యాదుకు జతచేసిన ధ్రువీకరణపత్రాలు, జతపరిచిన ఆధార పత్రాలను స్కాన్ చేసి, తహసీల్దార్ లాగిన్‌లో ఆన్‌లైన్ చేశారు. ఇలా ఏరోజుకారోజు కలెక్టర్‌కు ఆ జాబితా నివేదించారు. కలెక్టర్ స్థాయిలో సమస్యల వారీగా మరో నివేదిక రూపొందించి సీసీఎల్‌కు పంపించారు. సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా ఫిర్యాదు సమర్పించిన రైతుతోపాటు సమీపంలోని రైతులకు అధికారులు నోటీసులు జారీ చేయనున్నారు. ఇద్దరి వద్దనున్న రికార్డులతోపాటు ఆధారాలను సమర్పించేందుకు ఏడు రోజుల గడువు ఇస్తారు. నిర్దేశిత గడువులోగా సమర్పించిన ఆధారాలు, రికార్డులను అధికారులు పరిశీలిస్తారు. రెవెన్యూ కార్యాయంలోని రికార్డులతో వాటిని పోల్చిచూస్తారు. అనంతరం ఆ దరఖాస్తు వాస్తవికతను తేల్చి సమస్యకు పరిష్కారం చూపుతారని చెబుతున్నారు. తద్వారా భూభారతితోనైనా తమ భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

పెద్దపల్లిలో 2,508.. రామగుండంలో 124

జిల్లావ్యాప్తంగా అత్యధికంగా పెద్దపల్లి మండలంలో 2,508 దరఖాస్తులు అందాయి. అత్యల్పంగా రామగుండంలో 124 దరఖాస్తులు అధికారులకు అందాయి. వచ్చిన దరఖాస్తుల్లో సాదాబైనామాలు పక్కన పెడితే.. అత్యధికంగా మిస్సింగ్ సర్వే నంబర్లు, భూ విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, అసైన్డ్‌ల్యాండ్ కేసులే ఉండడం గమనార్హం.

45 రోజుల్లో పరిష్కారం

వచ్చే 45 రోజుల్లో భూభారతి దరఖాస్తులు పరిష్కరించేలా కార్యాచరణ అమలు చేస్తాం. ప్రతీదరఖాస్తు పరిష్కారానికి మండలంలో తహసీల్దార్ బాధ్యత వహించేలా, ప్రతీదరఖాస్తుదారుకు నోటీస్ ఇచ్చి పరిష్కరిస్తాం. ప్రతీ మండలంలో పెండింగ్ భూ భారతి దరఖాస్తుల సంఖ్య ఆధారంగా ఈనెల 23 నుంచి ఆగస్టు 14వ తేదీ వరకు రోజుకు ఎన్నిపరిష్కారం కావాలి? ఎన్ని బృందాలను ఏర్పాటు చేయాలనే దానిపై ప్రణాళిక రూపొందిస్తాం. అందుకు అనుగుణంగా సిబ్బందికి బాధ్యతలు కేటాయించి పరిష్కరిస్తాం. రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులకు పరిష్కారం చూపలేనిపక్షంలో దానికిగల కారణాలను తెలియజేస్తూ స్పష్టంగా జవాబు తెలియజేస్తాం. దరఖాస్తుదారును కార్యాలయాల చుట్టూ తిప్పుకునే ధోరణి ఉండదు.

– కోయ శ్రీహర్ష, కలెక్టర్

అర్హులందరికీ పరిహారం

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

సుల్తానాబాద్/యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలో సింగరేణి మైన్స్ కోసం భూములు కోల్పోతున్న అర్హులైన నిర్వాసితులందరికీ పరిహారం అందిస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. సింగరేణి లీజు భూముల పరిహారం ప్రక్రియపై శనివారం సుందిళ్ల గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ మాట్లాడారు. ఆర్జీ–1లో బొగ్గు గనులకు అవసరమైన లీజు కోసం 269 ఎకరాల్లో సర్వే చేశారని, రికార్డుల ప్రకారం ఇవి సింగరేణి లీజు భూములన్నారు. ఒక్కో సర్వే నంబరులో నలుగురైదుగురు రైతులు యాజమాన్య హక్కు క్లెయిమ్ చేస్తున్నారని కలెక్టర్ వివరించారు. అధికారికంగా పట్టాలు లేకున్నా కబ్జాలోనివారు నష్టపోతారనే ఉద్దేశంతో మానవతా దృక్పథంతో ఎకరాకి రూ.6.50 లక్షల చొప్పున పరిహారం చెల్లించేలా సింగరేణి యాజమాన్యాన్ని ఒప్పించామని ఆయన వెల్లడించారు. ఈక్రమంలోనే అర్హులైన జాబితానే రూపొందించామని కలెక్టర్ తెలిపారు. అనర్హులు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి సురేశ్, ఆర్జీ–1 జీఎం లలిత్ కుమార్, తహసీల్దార్ సుమన్ పాల్గొన్నారు.

నిరంతరంగా విద్యుత్ సరఫరా

పెద్దపల్లిరూరల్: జిల్లాలో వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. విద్యుత్ శాఖ పనితీరుపై కలెక్టరేట్‌లో శనివారం ఆయన సమీక్షించారు. జిల్లాలోని 7 సబ్ డివిజన్లలో అవసరం మేరకు విద్యుత్ స్తంభాలు అందుబాటులో ఉంచాలని, లైన్‌మెన్ అప్రమత్తంగా ఉండాలని, లూస్ వైర్లు సరిచేయాలని, ఇళ్లనుంచి వెళ్లే, వేలాడే విద్యుత్ తీగలు సరిచేయాలని ఆదేశించారు. జిల్లాలోని ఒక మండలాన్ని ఎంపిక చేసుకొని సోలార్ విద్యుత్ ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఈ మాధవరావు, డీఈలు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా నేత ఇ.నరేశ్



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

గోదావరిఖని: ఆపరేషన్ కగార్ పేరిట కేంద్రప్రభుత్వం చేపట్టిన హత్యాకాండను వెంటనే నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి ఇ.నరేశ్ డిమాండ్ చేశారు. స్థానిక పైలాన్ చౌరస్తా వద్ద శనివారం పార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టు పార్టీతో శాంతిచర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని ఆర్ఎస్ఎస్, బీజేపీ నరేంద్రమోదీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట 2026 కల్లా మావోయిస్టులను అంతం చేస్తామని ప్రకటించిందన్నారు. అప్పటి నుంచి కొనసాగిస్తున్న యుద్ధం.. అమాయక ఆదివాసీలతోపాటు మావోయిస్టు పార్టీ నాయకులను బూటకపు ఎన్‌కౌంటర్ల పేరిట హత్య చేస్తున్నారని ఆరోపించారు. బూటకపు ఎన్‌కౌంటర్లలో ఆదివాసీలే ఎక్కువ మంది మృతి చెందారని అన్నారు. ఖనిజ సంపదను స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు అప్పగించే లక్ష్యంగా ఈహత్యాకాండ సాగుతోందని ఆయన ధ్వజమెత్తారు. కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టు పార్టీతో శాంతిచర్చలను వెంటనే ప్రారంభించాలనే డిమాండ్‌తో ఈనెల 25న వరంగల్‌లో జరిగే సదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ, నాయకులు రాజేశం, దుర్గయ్య, మల్లేశం, రాజన్న, కొమురయ్య, ప్రసాద్, రవికుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యకు ఎన్టీపీసీ భరోసా

- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్



సైకిళ్లు పంపిణీ చేస్తున్న రాంచందర్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ బాలికల విద్యకు భరోసా కల్పించడం అభినందనీయమని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ అన్నారు. శనివారం రాత్రి ఎన్టీపీసీ రామగుండం పీటీఎస్‌లోని వికాస కేంద్రం హాల్‌లో ఎన్టీపీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న బాలికలకు ఆయన సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్టీపీసీ విద్యుత్ ఉత్పత్తి పాటు ప్రభావిత, పునరావాస గ్రామాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మరింత కృషి చేయాలని సూచించారు. ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సామంత, దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాకీ సామంత, ఎన్టీపీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నవనీత్ రాథోడ్, కార్యదర్శి మహేందర్, అంజయ్య, ఉద్యోగ గుర్తింపు సంఘం ప్రతినిధులు ఉన్నారు.

తేలని లాభాలా వాటా!

- గతేడాది చరిత్రలో అత్యధిక లాభాలు
- 2023–24లో కార్మికుల వాటా 33శాతం
- ఉద్యోగులకు రూ.788.20 కోట్ల చెల్లింపు
- గతేడాది కాంట్రాక్టు కార్మికులకూ రూ.5వేల వాటా



గత తొమ్మిదేళ్లలో సింగరేణి సాధించిన వాస్తవ లాభాలు(రూ.కోట్లలో)

ఏడాది	లాభాలు	కార్మికుల వాటా	చెల్లింపు	చెల్లింపు తేదీ
2015–16	1,066.13	23	245.20	07-10-2016
2016–17	395.38	25	98.84	29-09-2017
2017–18	1,212.75	27	327.27	29-08-2018
2018–19	1,766.00	28	493.00	04-10-2019
2019–20	993.00	28	278.04	14-10-2020
2020–21	272.20	29	79.06	11-10-2021
2021–22	1,227.00	30	368.00	10-10-2022
2022–23	2,222.00	32	711.00	22-10-2023
2023–24	2,388.50	33	788.20	20-09-2024

గోదావరిఖని: గత ఆర్థిక సంవత్సరం పూర్తయింది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తోంది. గతేడాది సింగరేణి నిర్దేశిత 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించింది. బొగ్గు ఉత్పత్తిపై స్పష్టమైన ప్రకటన చేసిన సింగరేణి యాజమాన్యం.. లాభాలపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వడంలేదు. ఆధునిక సాంకేతికను విరివిగా వినియోగిస్తున్న సింగరేణి.. సాధ్యమైనంత త్వరగా లాభాల వాటా ప్రకటిస్తుందని కార్మికులు ఎదురుచూస్తున్నారు. అంతేకాకుండా సీఎండీ ఎండీ బలరాం ఫైనాన్స్ డైరెక్టర్‌గానూ బాధ్యతలు నిర్వహిస్తుండడంతో లాభాల విషయాన్ని త్వరగానే తేల్చేస్తారని భావిస్తున్నారు.

వ్యాపార విస్తరణలో వేగంగా..

బొగ్గు, విద్యుత్ ఉత్పత్తి తదితర రంగాల్లో వేగంగా దూసుకెళ్తున్న సింగరేణి సంస్థ.. దేశంలో ఏ సంస్థలో లేనివిధంగా కార్మికులను వాటాదారులుగా చేర్చి తను సాధించిన లాభాల్లో ఏటా వాటా చెల్లిస్తూ వస్తోంది. దేశానికే సింగరేణి తలమానికంగా నిలుస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సింగరేణి సంస్థ ఏటా బొగ్గు ఉత్పత్తి, విద్యుత్ ఉత్పత్తిపై ఆర్థిక నివేదికలు సమర్పిస్తూ వస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి 70.02 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 2,388.50 కోట్ల లాభాలు సాధించింది. అందులో కార్మికుల వాటాగా 33 శాతం ప్రకటించారు. ఈలెక్కన గత ఆర్థిక సంవత్సరంలో రూ.788.20 కోట్లు కార్మికులకు వాటాగా ప్రకటించారు. గతేడాదికన్నా ఈసారి బొగ్గు ఉత్పత్తితోపాటు టర్నోవర్ పెరగడంతో సంస్థకు లాభాలు కూడా అధికంగానే ఉంటాయని ఉద్యోగులు భావిస్తున్నారు. ఈక్రమంలో కార్మికులకు లాభాల ఎక్కువగా వస్తాయని ఆశగా ఎదురు చూస్తున్నారు.

లాభాల వాటా ఎంత..?

ఏటా సింగరేణి యాజమాన్యం లాభాలను ప్రకటించి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తుంది. అందులో కార్మికులకు లాభాల వాటా ముఖ్యమంత్రి ఖరారు చేసి ప్రకటన ఇస్తారు. ఈక్రమంలో ఈసారి లాభాలు ఖరారు అయితే లాభాల వాటా సీఎం ప్రకటించే అవకాశం ఉంది. గతేడాది 33శాతం కార్మికుల లాభాల వాటా ఉండగా, ఈసారి వాటా మరింత పెంచే అవకాశాలుంటాయని కార్మికులు భావిస్తున్నారు.

వేగంగా ఇంటర్నల్ ఆడిట్..

సింగరేణి సీఎండీ బలరాం స్వతహాగా ఫైనాన్స్ డైరెక్టర్ కావడంతో లాభాలు తేల్చడంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈక్రమంలోనే సాధ్యమైనంత త్వరగా లాభాలను తేల్చే పనిలో అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనికోసం ఇంటర్నల్ ఆడిట్ నిర్వహిస్తున్నారు. స్టాట్యుటరీ ఆడిట్ ద్వారా విచారణ కొనసాగుతోంది.

వేగంగా ఆడిట్



సింగరేణి సాధించిన లాభాలపై ఆడిట్ వేగంగా సాగుతోంది. త్వరలోనే ముఖ్యమంత్రికి వార్షిక నివేదిక సమర్పిస్తాం. సీఎం ఆదేశాల ప్రకారం లాభాల వాటా ఉద్యోగులకు అందజేస్తాం. సాధ్యమైనంత త్వరగా లాభాలను తేల్చేందుకు ఆర్థిక శాఖ వేగంగా ముందుకు సాగుతోంది. గతం కన్నా ఈసారి లాభాలు ఎక్కువగానే వచ్చే అవకాశం ఉంది.

– ఎన్.బలరాం, సీఎండీ, సింగరేణి

డివిజన్ల పునర్విభజనపై ఉత్కంఠ

- ఇంకా విడుదలకాని తుది నోటిఫికేషన్
- అందుబాటులో లేని బల్దియా అధికారులు
- మీడియాకు సైతం సమాచారం వెల్లడించని వైనం



రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలో డివిజన్ల పునర్విభజన ఉత్కంఠంగా మారింది. 50 నుంచి 60 డివిజన్లకు పెంచుతూ బల్దియా అధికారులు రూపొందించిన పునర్విభజన ముసాయిదాను ఈనెల 4న విడుదల చేశారు. దీనిపై నగరవాసుల నుంచి అభిప్రాయాలను స్వీకరించిన అధికారులు.. మార్పులు చేర్పులతోపాటు డివిజన్ల స్వరూపంపై మ్యాప్‌లు, వైశాల్యం, హద్దులు, ఓటర్ల సంఖ్యతో తయారు చేసిన 60 డివిజన్ల తుది నోటిఫికేషన్‌ను శనివారం విడుదల చేయాల్సి ఉంది. కానీ.. రాత్రి 7గంటల వరకు కూడా బల్దియా అధికారులు పునర్విభజనపై ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఇదే విషయంపై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌తోపాటు టౌన్‌ప్లానింగ్ తదితర విభాగాల్లో సమాచారం కోసం ప్రయత్నించగా, అధికారులు కార్యాలయంలో అందుబాటులో లేరు. డివిజన్ల పునర్విభజన తుది నోటిఫికేషన్‌పై డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామిని వివరణ కోరగా, తనకు వివరాలు తెలియవన్నారు. కమిషనర్‌తోపాటు టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులను ఫోన్లో సంప్రదించడానికి ప్రయత్నించినా.. వారు ఫోన్లను లిఫ్ట్ చేయలేదు. దీంతో డివిజన్ల పునర్విభజన తుది నోటిఫికేషన్ ప్రకటన విడుదలలో జాప్యంపై ఉత్కంఠ నెలకొంది. డివిజన్ల స్వరూపంపై అయోమయం, ఆందోళనతో ఉన్న మాజీ కార్పొరేటర్లు, ఆశావహులు.. తుది నోఫికేషన్‌పై ఆరా తీస్తున్నారు. హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయంలో తమకు పరిచయం ఉన్న అధికారులు, సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. శనివారం ఫైనల్ నోటిఫికేషన్ వస్తుందని ఆశపడినవారు, మాజీ కార్పొరేటర్లల్లో ఉత్కంఠ తారస్థాయికి చేరింది. అయితే, డివిజన్ల పునర్విభజన తుది జాబితా ప్రభుత్వ పరిశీలనలో ఉందని, అధికారికంగా అక్కడి నుంచే ఫైనల్ నోటిఫికేషన్‌తోపాటు గెజిట్‌ను విడుదల చేయవచ్చనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

క్లుప్తంగా

ఉరేసుకుని వివాహిత బలవన్మరణం

మెట్‌పల్లిరూరల్: ఆత్మకూర్‌కు చెందిన అంబటి శృతి (27) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. శృతికి ఏడాది క్రితం వేములకుర్తికి చెందిన రాచమల్ల తిరుపతితో వివాహమైంది. అతడు ఉపాధి నిమిత్తం ఆర్నెళ్లక్రితం దుబాయ్ వెళ్లాడు. అంతకుముందు నుంచే అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న శృతి 15 రోజుల క్రితం ఆత్మకూర్‌కు వచ్చింది. ఓ వైపు ఒంటరితనం.. మరోవైపు అనారోగ్య సమస్యలతో విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుమ్మరికుంటలో కారుఢీకొని వృద్ధుడు మృతి

జూలపల్లి(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం కుమ్మరికుంటలో కారు ఢీకొని అదే గ్రామానికి చెందిన నాగవెల్లి మొండయ్య(59) మృతి చెందాడు. ఎస్సై సనత్‌కుమార్ కథనం ప్రకారం.. కుమ్మరికుంటకు చెందిన మొండయ్య శుక్రవారం సైకిల్‌పై పోస్టాఫీసుకు వెళ్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన కమటం రవి తన కారును వేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ సైకిల్‌పై వెళ్తున్న మొండయ్యను ఢీకొట్టాడు. కిందపడ్డ మొండయ్య తలకు బలమైన గాయం కావడంతో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స తర్వాత కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు సతీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

సదాశివపల్లి స్టేజీ వద్ద ఆటోలోంచి పడి వ్యక్తి ..

మానకొండూర్: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన మందల రామకృష్ణారెడ్డి (44) ప్రమాదవశాత్తు ఆటోలోంచి పడి శనివారం మృతి చెందాడు. సీఐ బి.సంజీవ్ వివరాల ప్రకారం.. అన్నారం గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డికి ఇంటి వద్ద ఛాతినొప్పి వచ్చింది. అతని తల్లితో కలిసి ఆటోలో కరీంనగర్‌కు బయల్దేరారు. మార్గమధ్యలోని సదాశివపల్లి స్టేజీ వద్ద ప్రమాదవశాత్తు ఆటోలోంచి రహదారిపై పడిపోయాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని పరీక్షించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోలీసుల అదుపులో నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠా?

కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని పోచమ్మ ఆలయం సమీపంలో నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న ముఠాను రెండురోజుల క్రితం జగిత్యాల టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నట్లు సమాచారం. పోలీసులు దాడి చేసిన సమయంలో నాలుగైదు డిగ్రీ సర్టిఫికెట్లు దొరికినట్లు తెలిసింది. మంత్ర కంప్యూటర్స్ పేరిట సాగుతున్న ఓ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌లోనే నకిలీ సర్టిఫికెట్ల ముఠా దందా నడుపుతున్నట్లు తెలిసింది. కోరుట్లలో ఉన్న నకిలీ సర్టిఫికెట్ల తయారుదారులతో ఇంకా ఎవరికైనా సంబంధాలు ఉన్నాయా..? అన్న విషయంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు లోతుగా విచారిస్తున్నారు. నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లను రూ.15వేల నుంచి రూ.30 వేల వరకు అమ్మినట్లు సమాచారం. కేవలం డిగ్రీ కాకుండా ఇతరత్రా నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సగం సీట్లు ఖాళీ

- గంభీరావుపేటలో ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినుల హాస్టల్
- పాఠశాల విద్యార్థుల కోసం ఎస్సీ బాలుర వసతి గృహం
- రెండింటిలోనూ వంద చొప్పున సీట్లు
- అడ్మిషన్ల కోసం ప్రచారబాటలో అధికారులు


గంభీరావుపేటలోని ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినుల హాస్టల్

గంభీరావుపేట(సిరిసిల్ల): విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన హాస్టళ్లలో సగం సీట్లు కూడా భర్తీ కావడం లేదు. అధికారుల ప్రచారం చేసినా చాలా మంది ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా సగంలోపే సీట్లు భర్తీ అవుతున్నాయి. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల విద్యార్థుల కోసం గంభీరావుపేట మండల కేంద్రంలో రెండు వసతి గృహాలను వేర్వేరుగా ఏర్పాటు చేశారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థుల కోసం ఎస్సీ బాలుర వసతి గృహం. ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థినుల కోసం మరో హాస్టల్ ఏర్పాటు చేశారు. రెండు హాస్టళ్లలో వంద సీట్ల చొప్పున కేటాయించారు.

సగం సీట్లు ఖాళీ

ప్రస్తుతానికి రెండు హాస్టళ్లలో సగం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. దాదాపు 50 విద్యార్థుల్లోపే ఉన్నారు. గతేడాది పొడవునా ఆ సీట్లు ఖాళీగానే ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పూర్తిస్థాయిలో భర్తీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అన్ని రకాల వసతులు ఉన్నా వసతిగృహంలో సీట్లు ఎందుకు ఖాళీగా ఉంటున్నాయో చర్చిస్తూ.. విద్యార్థుల సంఖ్య పెంచాలనే ఉద్దేశంతో అధికారులు వసతిగృహంలో చేరాలని, చేర్పించాలని ప్రచారం చేస్తున్నారు. ఇటు కళాశాల అధ్యాపకులతో.. అటు పాఠశాలల ఉపాధ్యాయులతో కలిసి ప్రచారబాటలో పాల్గొంటున్నారు. వసతిగృహాల్లో కల్పిస్తున్న సదుపాయాలపై తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. ఇతర మండలాలకు చెందిన విద్యార్థులకు సైతం ప్రవేశాలు కల్పించడం జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. వసతిగృహానికి కేటాయించిన వంద సీట్లలో ఎస్సీలకు 75 శాతం, బీసీలకు 12, ఎస్టీలకు 6 శాతం చొప్పున సీట్లు కేటాయిస్తున్నారు.


అడ్మిషన్ల కోసం ప్రచార బాట

రెండు హాస్టళ్లలోనూ ప్రస్తుతం సగానికి పైగా సీట్లు ఖాళీగానే ఉన్నాయి.

హాస్టళ్లలో పౌష్టికాహారం

విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలతోపాటు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నారు. ఉదయం 7 గంటలకు రాగిజావ, పాలు ఇస్తారు. అనంతరం గంట తర్వాత బ్రేక్‌ఫాస్ట్‌లో భాగంగా ఉప్మా, పులిహోర, కిచిడి, చపాతి, పూరీ, ఇడ్లీ, జీర రైస్, టమాట అన్నం.. ఇలా రోజుకో రకంగా ఇస్తారు. మధ్యాహ్నం పాఠశాలలో భోజనం ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు స్నాక్స్ కింద పల్లీపట్టీలు, అటుకులు, బిస్కెట్స్, శనగలు, బబ్బర్లు, స్వీట్స్‌తోపాటు ప్రతి ఆదివారం మధ్యాహ్నం చికెన్‌రైస్, గుడ్డు ప్రత్యేకంగా అందిస్తారు. వారంలో రెండు రోజులు గుడ్డుతోపాటు అరటి పళ్లు, ఇతర పళ్లు విద్యార్థులకు అందించనున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



గంభీరావుపేటలోని కళాశాల, పాఠశాల విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన ఎస్సీ బాలుర, బాలికల వసతిగృహాల్లో అడ్మిషన్ల కోసం ప్రచారం నిర్వహిస్తున్నాం. వసతిగృహాల్లో ఉండి చదువుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పుడిప్పుడే పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమయ్యాయి. వంద సీట్లు భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. గంభీరావుపేట మండలంతోపాటు చుట్టుపక్కల మండలాల్లోనూ విద్యార్థుల తల్లిదండ్రులకు హాస్టల్ ప్రత్యేకతలను, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి అవగాహన కల్పిస్తున్నాం.

– భూదేవి, వసతిగృహాల సంక్షేమాధికారి, గంభీరావుపేట

జీతం.. సతమతం

- గోపాలమిత్రలకు 9నెలలుగా అందని వేతనం
- కృత్రిమ గర్భధారణ లక్ష్యం పూర్తికాకుంటే జీతంలో కోత


వైద్యమందిస్తున్న గోపాలమిత్ర

కరీంనగర్ అర్బన్: పాడి పరిశ్రమ వృద్ధిలో కీలక పాత్ర పోషించే గోపాలమిత్రలు వేతనాలు అందక మదనపడుతున్నారు. గౌరవ వేతనంతో సేవలందిస్తుండగా 9నెలలుగా సదరు వేతనం లేక ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందించే 9నెలల గౌరవ వేతనం రాకపోవడంతో అప్పులతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. పశు సంపద అభివృద్ధి కోసం గ్రామాల్లో విస్తృతంగా సేవలందిస్తున్నా సక్రమంగా వేతనాలు రాక సతమతమవుతున్నారు.

ఆర్‌ఎంపీల్లా గోపాలమిత్రలు

2000 సంవత్సరంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (డిస్ట్రిక్ లైవ్ స్టాక్ డెవలప్ మెంట్ ఏజెన్సీ (డీఎల్డీఏ)) ద్వారా గోపాలమిత్ర వ్యవస్థను ఏర్పాటు చేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులకు కృత్రిమ గర్భధారణ చేయడంతో పాటు పాడి రైతులకు అందుబాటులో ఉంటూ పశువులకు ప్రథమ చికిత్స అందిస్తున్నారు. నట్టల నివారణ మందులు, వాక్సినేషన్, బీమా చేయడం పశువైద్యుల సూచనల మేరకు అన్ని రకాల వైద్య సేవలను అందిస్తున్నారు.

వేతనంలో 40 చొప్పున కట్

ఆయా మండలాల్లో ఉన్న గోపాలమిత్ర సిబ్బంది నెలకు 80నుంచి 120 పశువులకు కృత్రిమ గర్భధారణ (సేమన్) చేయాలి. దీనికి గోపాలమిత్ర సిబ్బంది రూ.40 చొప్పున రైతుల నుంచి వసూలు చేసి ప్రభుత్వ ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. ప్రతి నెలా నిర్దేశించిన లక్ష్యాన్ని గోపాలమిత్రలు పూర్తి చేయాల్సిందే. లేదంటే నెల జీతంలో కోత తప్పదు. ఒక్కో పశువుకు రూ.40 చొప్పున వారి వేతనం నుంచి కట్ చేస్తారు. ఒక్కోనెల అనుకున్న లక్ష్యం పూర్తి చేయకపోవడంతో ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వేతనం కనీసం రెండు వేలు కూడా రావడం లేదని గోపాలమిత్రలు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుటుంబ పోషణ భారం

జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ(డీఎల్డీఏ) ద్వారా పశుసంవర్ధకశాఖలో ఉమ్మడి జిల్లాలో 135 మంది గోపాలమిత్ర సిబ్బంది పని చేస్తున్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం రూ.11,050 చొప్పున గౌరవవేతనం అందిస్తోంది. చాలీచాలనీ వేతనం కూడా ప్రతినెలా అందడం లేదు. జిల్లాలో ఇప్పటికే గోపాలమిత్రలకు ఏడు నెలల వేతనం చెల్లించాల్సి ఉంది. రెండేళ్లుగా కేంద్ర ప్రభుత్వం అందించాల్సిన పారితోషికం సైతం రాలేదు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు గోపాలమిత్ర సిబ్బంది వాపోతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఏడు నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. ప్రతి కార్యక్రమంలో మా పాత్ర తప్పనిసరి. చాలిచాలని వేతనంతో చాలా ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. కృత్రిమ గర్భధారణ చికిత్సకు టార్గెట్ లేకుండా చూడాలి.

– తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, గోపాలమిత్రల సంఘం జిల్లా అధ్యక్షుడు, కరీంనగర్

ఎన్నాళ్లిలా?



గత 22ఏళ్లుగా సేవలందిస్తున్నాం. ఎప్పటికైనా ఉద్యోగాన్ని క్రమబద్ధీకరిస్తారన్న ఆశతో ఉన్నాం. దాదాపు అందరి వయసు ప్రభుత్వ ఉద్యోగాలకు సరిపోదు. ప్రభుత్వం మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.

– దుద్దెల వెంకటయ్య, జిల్లా సహాయ కార్యదర్శి, కరీంనగర్

రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఏకు గాయాలు

- పరిస్థితి విషమం


రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వీఆర్‌ఏ రాములు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ ఆఫీస్ ఎదుట శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఏతోపాటు మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. వీఆర్‌ఏ పరిస్థితి విషమంగా ఉంది. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. మండల కేంద్రానికి చెందిన బాధ పెద్దరాములు తహసీల్దార్ ఆఫీస్‌లో వీఆర్‌ఏగా పనిచేస్తున్నారు. శనివారం విధులకు హాజరయ్యేందుకు తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. రాజన్నపేటకు చెందిన తిమోతి అనే యువకుడు బైక్‌పై వేగంగా వస్తూ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాములు కుడికాలు విరిగింది. తిమోతి స్వల్పంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రాములను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు నంది కిషన్, బండారి బాల్‌రెడ్డి, బాధ రమేశ్ పరామర్శించారు. తహసీల్దార్ సుజాత రాములును పరామర్శించి, పరిస్థితి గురించి తెలుసుకున్నారు. రెవెన్యూశాఖ తరఫున తక్షణసాయంగా రూ.20వేలు ఆర్‌ఐ శ్రావణ్‌మార్ రాములు కుటుంబానికి అందజేశారు.

రాగి తీగ దొంగల అరెస్ట్


దొంగల అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఐ కిరణ్‌కుమార్

మెట్‌పల్లి: ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి తీగ, ఆయిల్‌ను ఎత్తుకెళ్తూ.. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఇద్దరు దొంగలను మెట్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై కిరణ్‌కుమార్ కథనం ప్రకారం.. మోతె సాయి(22), పల్లపు మల్లేశం(32) ఆర్థిక ఇబ్బందుల కారణంగా దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇద్దరు కలిసి పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి తీగ, ఆయిల్ అపహరించి అమ్ముతూ వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తున్నారు. రైతుల ఫిర్యాదు మేరకు పక్కా సమాచారంతో ఇద్దరిని పట్టుకొని వారి నుంచి వంద కిలోల రాగి వైరు, ద్విచక్రవాహనం, చోరీలకు ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ఇద్దరి అరెస్ట్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.


అంబులెన్స్‌తో కుమారుడిని తీసుకొచ్చి ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబం, స్థానికులు


మంథని సీఐ రాజుతో తన ఆవేదన వెలిబుచ్చుతున్న యువకుడి తల్లి రాజేశ్వరి

న్యాయం చేయండి

- అచేతనా స్థితిలోని కుమారుడితో ధర్నా
- పోలీసులు, ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్


అచేతనా స్థితిలో యువకుడు రాజ్‌కుమార్

మంథని: పోలీసులకు భయపడి తన కుమారుడు ఆత్మాహత్యకు యత్నించి ఇప్పుడు అచేతనా స్థితిలోకి వెళ్లాడని, తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబం, స్థానికులతో కలిసి శనివారం పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో ధర్నాకు దిగింది. అచేతనా స్థితిలో తన కుమారుడిని అంబులెన్స్‌లో ఉంచి ఆవేదన వ్యక్తం చేశారు. యువకుడి తల్లి శీలం రాజేశ్వరి కథనం ప్రకారం.. మంథని పట్టణంలోని శ్రీపాదకాలనీకి చెందిన తన కుమారుడు రాజ్‌కుమార్ ఎంగేజ్‌మెంట్‌కు వెళ్లి ఇంటికి వస్తుండగా వడ్లకల్లం వద్ద ఇద్దరు దోస్తులు మాట్లాడుకొని ఒకరినొకరు చిన్నగా కొట్టుకున్నారు. మరుసటి రోజు 30 మంది దాకా వచ్చి కేసు పెట్టారు. దీంతో రాజ్‌కుమార్‌ను పోలీస్ స్టేషన్ తీసుకెళ్లి కొట్టడంతో మనస్తాంపం చెందాడు. తన కుమారుడిని అన్యాయంగా పోలీస్‌స్టేషన్ తీసుకెళ్లారని, కొంతమంది ప్రజాప్రతినిధుల పేర్లు చెబుతూ పోలీసులు కొట్టారని ఆమె వివరించింది. ఈ క్రమంలో అవమానంతో మనదపడుతూ స్నానానికి వెళ్లి బాత్‌రూంలేనే ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో ఎనిమిది నెలలుగా చికిత్స పొందుతున్నాడు. అయినా, ఇంకా కోలుకోలేదు. దీంతో రాజ్‌కుమార్‌ను అంబులెన్స్ లోనే తల్లిదండ్రులు, బంధువులు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాకు తీసుకొచ్చారు. మంథని ఎస్సై, కానిస్టేబుల్, స్థానిక మాజీ కౌన్సిలర్, ప్రజాప్రతినిధులు, మరికొందరు హమాలీ కార్మికులపై చర్యలు తీసుకోవాలని బంధువులు ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న మంథని సీఐ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాధితులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని నచ్చజెప్పారు.

కొత్తపల్లిలో రెండు లారీల ఢీ

- ఓ డ్రైవర్‌కు విరిగిన కాలు.. మరో డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు


కొత్తపల్లిలో జరిగిన ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలో శనివారం వేకువజామున రెండు లారీలు ఢీకొన్నాయి. కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారి కొత్తపల్లి చెరువు సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్లు నిద్రమత్తులో ఉండడంతోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు వెల్లడించారు. స్థానికులు, బ్లూకోల్ట్స్ పోలీసుల వివరాల మేరకు.. నిజామాబాద్‌లో రైస్‌మిల్లు సామగ్రి ఖాళీ చేసి కరీంనగర్ వైపు వస్తున్న లారీ ఖమ్మం నుంచి గ్రానైట్ లోడ్‌తో గంగాధర వైపు వెళ్తున్న మరో లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ముందు భాగాలు దెబ్బతిన్నాయి. గ్రానైట్ లోడ్‌తో ఉన్న లారీ కొత్తపల్లి చెరువులో పడిపోయింది. ఓ లారీ డ్రైవర్ పురుషోత్తంరెడ్డి, క్లీనర్లు లారీ నుంచి బయట పడగా తలకు గాయాలయ్యాయి. లారీ యజమాని సూచనల మేరకు హైదరాబాద్ వెళ్లిపోయారు. రాజస్థాన్ రిజిస్ట్రేషన్ గల డ్రైవర్ భన్సీలాల్‌కు గాయాలు అధికంగా కావడంతో పాటు కాలు విరిగడంతో కరీంనగర్‌లోని ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్చాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న కొత్తపల్లి పోలీసులు లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

చట్టాలు తెలియక కటకటాల్లోకి..

- సౌదీ జైలులో మండెపల్లివాసి
- విడుదల చేయాలని ప్రవాసీ ప్రజావాణిని ఆశ్రయించిన వలసజీవి భార్య
- మూడున్నరేళ్ల జైలుశిక్ష
- క్షమాభిక్ష కోసం రాష్ట్ర ప్రభుత్వ సహాయం కోరిన కుటుంబం
- స్పందించిన ఐఏఎస్ అధికారిణి దివ్యదేవరాజన్



హైదరాబాద్‌లో ప్రవాసీ ప్రజావాణిలో మంద భీంరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న మండెపల్లివాసి నక్క దేవేంద్ర

సిరిసిల్ల: బతుకుదెరువు కోసం ఉన్న ఊరిని, కన్నవారిని, కట్టుకున్న భార్యను వదిలి గల్ఫ్ దేశం వెళ్తే.. అక్కడి చట్టాలు తెలియక జైలుపాలైన ఘటన వెలుగులోకి వచ్చింది. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండెపల్లికి చెందిన నక్క బాలనర్సు సౌదీ అరేబియాలో జైలుపాలయ్యాడు. తన భర్తను విడిపించాలని కోరుతూ అతని భార్య దేవేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించింది. సౌదీ చట్టాలపై అవగాహన లేకపోవడంతో మూడున్నరేళ్ల జైలుశిక్ష పడింది. ప్రస్తుతం రియాద్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 1న జైలుపాలైన బాలనర్సుకు సౌదీలోని ఇండియన్ ఎంబసీ ద్వారా న్యాయ సహాయం అందించి, క్షమాభిక్ష ఇప్పించాలని అతని భార్య నక్క దేవేంద్ర హైదరాబాద్ ప్రజాభవన్‌లోని 'ప్రవాసీ ప్రజావాణి'ని ఆశ్రయించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్‌చైర్మన్ మంద భీంరెడ్డి, సెలవుపై సౌదీ నుంచి వచ్చిన సామాజిక సేవకులు ఆసాని రాజిరెడ్డి, మహ్మద్ నవీద్‌లతో కలిసి సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి, సీనియర్ ఐఏఎస్ అధికారిణి దివ్యదేవారాజన్‌ను కలిసి గోడు వినిపించారు. ఇంటి డ్రైవర్ ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా బాలనర్సు తన అరబ్ యజమాని పిల్లలను పాఠశాలకు తీసుకెళ్లేవాడని తెలిపింది. పిల్లలతో స్నేహపూర్వక ప్రవర్తనను యజమాని అపార్థం చేసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్థానిక ఆచార వ్యవహారాలు, సున్నితత్వం తెలియకపోవడంతో అపోహలకు దారితీసి జైలుపాలయ్యాడని ఆమె తెలిపారు. వెంటనే స్పందించిన సీనియర్ ఐఏఎస్ అధికారిణి దివ్యదేవారాజన్, రాష్ట్ర ఎన్నారై విభాగం ఐఏఎస్ అధికారి సీహెచ్ శివలింగయ్యతో మాట్లాడారు. రియాద్‌లోని భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేస్తూ, సౌదీ అధికారుల వద్దకు క్షమాభిక్ష అభ్యర్థనను పంపడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గల్ఫ్ బాటలో జైలుపాలైన బాలనర్సు విడుదల కోసం అతని కుటుంబం నిరీక్షిస్తోంది.

తూకంలో తేడాపై రోడ్డెక్కిన రైతులు


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

- డీఆర్డీవోకు వినతిపత్రం

సిరిసిల్లఅర్బన్: ఐకేపీ ద్వారా విక్రయించిన సన్‌ఫ్లవర్ పంట తూకంలో తేడాపై ఇల్లంతకుంట మండలానికి చెందిన రైతులు శనివారం కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగారు. మండలంలోని ముస్కానిపేట, గాలిపల్లి, చిన్నకేసన్నపల్లి, పత్తికుంటపల్లి, తాళ్లపల్లి గ్రామాలకు చెందిన సుమారు 50 మంది రైతులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. వారు మాట్లాడుతూ ఐకేపీ ద్వారా విక్రయించిన సన్‌ఫ్లవర్ పంట తూకంలో వచ్చిన క్వింటాళ్లు మార్క్‌ఫెడ్ తీసుకున్న తూకానికి తేడా వస్తుందన్నారు. ఒక్కో రైతుకు మూడు క్వింటాళ్ల వరకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి డీఆర్‌డీవో శేషాద్రిని పిలిపించి తూకంలో తేడాలపై విచారణ చేపట్టి రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం రైతులు డీఆర్‌డీవోకు వివరాలతో కూడిన వినతిపత్రం అందించారు. సుధాకర్‌రెడ్డి, ఐదు గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.






స్వశక్తి మహిళలు తయారు చేసిన వస్తుసామగ్రి పరిశీలిస్తున్న బల్దియా డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, స్టాళ్లు, వంటలు పరిశీలిస్తున్న అధికారులు తదితరులు

స్ట్రీట్‌ఫుడ్.. రుచి అదిరెన్

- ఆకట్టుకున్న స్వశక్తి మహిళలు ఫుడ్ ఫెస్టివల్
- రుచి చూసి టేస్ట్‌కు లొట్టలేసిన నగర ప్రజలు

కోల్‌సిటీ(రామగుండం): పులిహోర.. చుడువ.. గారెలు.. సకినాలు.. నువ్వులడ్డూలు.. బెల్లం సేమియా, భక్ష్యాలు.. మిర్చీలు.. జొన్నరొట్టెలు.. ఇలా చెప్పుకుంటూ పోవడమే కాదు.. ఘుమఘుమలాడే వాసనలు.. నోరూరించే రుచులు.. రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట శనివారం స్వశక్తి మహిళలు చేపట్టిన స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ ప్రత్యేకత ఇది.. జనపనారతో తయారు చేసిన సంచులు, వివిధ రకాల వస్తువులు, వృథా వస్త్రాలతో రూపొందించిన మ్యాట్లు ముచ్చటగొలిపాయి. వీధి వ్యాపారులు చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలు.. ఎంతోరుచిగా ఉన్నాయి. స్వశక్తి మహిళలు స్వయంగా తయారు చేసిన పిండి వంటకాలు ఫెస్టివల్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రామగుండం నగరపాలక సంస్థ అధికారులు 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శనివారం మెప్మా ఆధ్వర్యంలో ప్రధాన రహదారి పక్కన ప్రదర్శనకు పెట్టారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీవీ రామన్ స్టాళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా 25 స్వశక్తి మహిళా సంఘాలకు రూ.2 కోట్ల 60లక్షల బ్యాంక్ లింకేజీ చెక్కును వారు అందజేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు నాయక్, జమీల్, ఆర్‌వో ఆంజనేయులు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్‌ఐ శంకర్‌రావు, సీనియర్ అకౌంటెంట్ రవితేజ, మెప్మా టీఎంసీ రజని, సీవోలు ఊర్మిళ, శ్వేత, ప్రియదర్శిని, ఆర్పీలు, ఓటీలు తదితరులు పాల్గొన్నారు.

అప్పులబాధతో నేతకార్మికుడి ఆత్మహత్య


వలస రమేశ్

సిరిసిల్లక్రైం: ప్రమాదంలో కాలువిరగడంతో పని చేయలేక.. అప్పులు తీర్చే మార్గం కనిపించక సిరిసిల్లలో నేత కార్మికుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌కు చెందిన నేతకార్మికుడు వలస రమేశ్(48) పవర్‌లూమ్స్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రెండేళ్ల క్రితం రమేశ్ కాలుకు దెబ్బతగిలి పనికి దూరయ్యాడు. సరైన ఉపాధి లేక.. కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు రూ.5లక్షలు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో స్థానిక కార్గిల్‌లేక్‌లో శనివారం దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య లావణ్య, కుమారులు సాయిచరణ్, సచిన్ ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.